క్లుప్తంగా

23న డివిజన్ స్థాయి స్పందన

మెళియాపుట్టి: మండలంలోని నేలబొంతు గ్రామంలో నెల 23వ తేదీన డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.సరోజిని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం పది గంటలకు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పందనను నిర్వహిస్తామన్నారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతోనే గిరిజన గ్రామంలో స్పందన నిర్వహిస్తున్నట్లు వివరించారు. డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. సమస్యలు ఉన్నవారు అర్జీలను అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ-పంట నమోదు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న లతశ్రీ

ఎల్.ఎన్.పేట: రబీలో సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో వేగంగా నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ అన్నారు. తన కార్యాలయంలో గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీలో రైతులు సాగు చేస్తున్న అపరాలు, వరి, ఇతర వాణిజ్య పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేయాలన్నారు. పంటల వివరాలు నమోదు చేయటం వలన రైతులు పంట అమ్ముకునే సమయంలో వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి రోజూ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు.

తొగిరిలో సీతారాముల కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

సారవకోట: తొగిరి గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణాన్ని అర్చకులు రామానుజాచార్యులు నిర్వహించారు. ఆలయ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి కల్యాణాన్ని జరిపించారు. తొలుత ఆంజనేయ స్వామికి ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే శనివారం స్వామి వారికి తమలపాకులతో అభిషేకం, హోమం, ఆదివారం సిందూరార్చన, అఖండ దీపారాధన కార్యక్రమాలు జరగనున్నాయి. సోమవారం స్వామి వారి మంగళ స్నానాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భూముల రీ సర్వేతో సమస్యలు పరిష్కారం



సర్వేలో పాల్గొన్న రాజులునాయుడు తదితరులు

కొత్తూరు: సమగ్ర భూముల రీసర్వేతో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని పీఏసీఎస్ డైరెక్టర్ గార రాజులు నాయుడు అన్నారు. మాకవరంలో నిర్వహిస్తున్న భూములు రీ సర్వేను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న భూముల రీసర్వే నిర్ణయం రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. సర్వే బృందానికి రైతులు సహకరించాలన్నారు. సర్వేయర్ గిరీష పాల్గొన్నారు.

27 మద్యం బాటిళ్ల పట్టివేత

పాతపట్నం: కొరసవాడ గ్రామంలో బెల్ట్ షాపులపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. కిరాణా దుకాణంలో బెల్ట్ షాపు నడుపుతున్న బొను రాముని 27 మద్యం బ్యాటిళ్లతో పట్టుకున్నారు. పట్టబడిన మద్యం బాటిళ్ల విలువ రూ.5,130 ఉంటుందని..వాటిని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎస్.కామేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

పొందూరు: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ రాంబాబు, హౌసింగ్ డీఈ శ్యామలరావు అధికారులకు ఆదేశించారు. తోలాపిలో జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల ను శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో పెరిగిన చెట్లు, పుట్టలను తొలగించి క్లీనింగ్ చేయించాలని సూచించారు. ఈవో జనార్దనరావు, నాయకులు పప్పల రాధాక్రిష్ణ, వీఆర్వో రంగారావు ఉన్నారు.

క్రికెట్ పోటీల విజేతగా మైనర్స్ జట్టు

పాతపట్నం: పాతపట్నం ఆల్ఆంధ్ర రోడ్డు సమీపంలో మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నైట్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ విన్నర్‌గా మైనర్స్, రన్నర్‌గా ఆకు వారియర్స్ జట్లు నిలిచాయి. విన్నర్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్‌కు రూ.10 వేలు, ట్రోఫీలను తేజేశ్వరరావు అందజేశారు. సరాలి సర్పంచ్ షణ్ముఖరావు ఉన్నారు.

హామీ ఇవ్వకపోయినా అమలు చేస్తున్నాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- చీమలవలస గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్:

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని వాటిని కూడా అమలు చేసిన ఘనత వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. చీమలవలస గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ మూడున్నరేళ్ల పాలనలో చేకూరిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంటే ప్రజలకు ధీమా అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం, సక్రమంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అన్నారు. ప్రతిఇంట్లో ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందినవారు ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హత ఉండి పథకాలు రాని కుటుంబాలు ఉంటే వాటిపై ఆరా తీసి అక్కడికక్కడే పరిష్కరించే విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనే దీనికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ తిర్లంగి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు కూటికుప్పల సన్యాసిరావు, సర్పంచ్‌లు ఎన్ని రామచంద్రరావు, చిలకపల్లి సురేష్, ఎంపీడీవో ఎం.రేణుక, ఏవో ఎం.మోహనరావు, ఏపీఎం కూర్మారావు, పీఏవో లక్ష్మీనరసమ్మ, ఎలక్ట్రికల్ ఏఈ బి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి పి.రాము, పార్టీ నాయకులు గురుగుబెల్లి నీలారావు, పొన్నాడ రాము, గురుగుబెల్లి చంద్రయ్య, మానుకొండ వెంకటరమణ, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

- ఏడీ రఘునాథ్



మాట్లాడుతున్న ఏడీ రఘునాథ్

నరసన్నపేట: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఔత్సాహిక యువతీ, యువకులు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ ఆర్‌వీ రఘునాథ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పథకాల కింద పరిశ్రమలను ఏర్పాటు చేయవచ్చన్నారు. రూ.50 లక్షల వ్యయంతో చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై నిరుద్యోగ యువతీ యువకులు అవగాహన పెంచుకోవాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మధుసూదనరావు, పరిశ్రమల శాఖ అధికారులు వెంకటరమణ, బ్రహ్మ, ఏపీఎం హేమసుందరరావు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కొత్తూరు: వివిధ కేసులో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను శనివారం ఉదయం పది గంటలకు కొత్తూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్టు ఎస్సై మురపాక గోవింద తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బజాజ్ పల్సర్ బైక్ ప్రభుత్వం ధర రూ. 10 వేలు, హీరో హెచ్ఎఫ్ డీలక్స్ బైక్ రూ. 30 వేలుగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించారన్నారు. ఆసక్తి ఉన్నవాళ్లు వేలంలో పాల్గొనాలని సూచించారు.

సక్రమంగా పని చేయని వీవోఏలను తొలగిస్తాం



సిబ్బందితో మాట్లాడుతున్న విద్యాసాగర్

సరుబుజ్జిలి: సక్రమంగా పనిచేయని, నగదు వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడిన వీవోఏలను వెంటనే తొలగిస్తామని డీఆర్‌డీఏ పీడీ బి.విద్యాసాగర్ హెచ్చరించారు. మండల వైకేపీ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు. జగనన్న తోడు, ఆసరా, కల్యాణమస్తు, బ్యాంకు లింకేజీ, చేయూత పథకాలు అమలు గురించి చర్చించారు. కొన్ని సంఘాల్లో సీసీలు, వీవోఏలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వెంటనే విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకొంటానని హెచ్చరించారు. గ్రామ సంఘాలతో నిర్వహించే సమావేశాలకు తాను కూడా హాజరుకానున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాల గురించి గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో వైకేపీ ఏపీఎం కమలకుమారి పాండ్యన్, స్త్రీనిధి మేనేజర్ నాగరాజు, అకౌంటెంట్ కల్యాణి పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ల నియామకం



డోల ఉదయభాస్కర్ | బుక్కా లక్ష్మణరావు | పల్లి కృష్ణ

నరసన్నపేట: మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్లుగా పలువురిని వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్ నియమించారు. నరసన్నపేట నియోజకవర్గంలో మూడు మండలాలకు రైతు సమస్యలపై అవగాహన కలిగి ఉన్న ఆదర్శ రైతులను ఈ పదవులకు ఎంపిక చేశారు. డోల ఉదయ భాస్కర్ (పోలాకి) బుక్కా లక్ష్మణరావు (జలుమూరు), పల్లి కృష్ణ (సారవకోట) నియమితులయ్యారు. వీరు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న కృష్ణప్రసాదు

సరుబుజ్జిలి: రహదారి భద్రతపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాదు అన్నారు. రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారిపై ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా విలువైన ప్రాణాలు గాలిలో కలసిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, ఎన్ఎస్ఎస్ పీఓ దుగ్గివలస రాంప్రసాదు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బూర్జలో స్పీకర్ తమ్మినేని పర్యటన

బూర్జ: స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదలైంది. ఓ.వి.పేట గ్రామంలో ఉదయం పదిన్నర గంటలకు వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం, 11 గంటలకు లచ్చయ్యపేట గ్రామంలో నాడు-నేడు పథకంలో భాగంగా నిర్మించిన పాఠశాల భవన ప్రారంభోత్సవం కార్యక్రమంలో స్పీకర్ పాల్గొంటారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



టోర్నీ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

నరసన్నపేట: సత్యవరం గ్రామంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న చరణాబింకా క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. సాయంత్రం జరిగిన ఫైనల్ పోరులో పోలాకి మండలం కమ్మరిపేట, నరసన్నపేట మండలం సత్యవరం జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన కమ్మరిపేట జట్టు 42 పరుగులకు ఆలౌట్ కాగా సత్యవరం టీమ్ 'మూడు వికెట్లు నష్టానికి ఐదు ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. 13వ తేదీ ప్రారంభమైన నియోజకవర్గస్థాయి పోటీల్లో 54 జట్లు పాల్గొన్నాయి. విజేత టీమ్‌కు ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్‌లు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి నీలం, యగళ్ల నర్సునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు

ఆమదాలవలస: సంక్రాంతి రోజున తన ఇంటిపై పలువురు దాడికి పాల్పడ్డారని వెదుళ్లవలస గ్రామానికి చెందిన చిలకపల్లి రామ్మూర్తి ఫిర్యాదు చేశారని పోలీసులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మణరావుతోపాటు మరో ఆరుగురు దాడి చేయడంతోపాటు గొడవ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వై.కృష్ణ తెలిపారు.

నేడు నేతాజీనగర్ కాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొత్తూరు: కర్లెమ్మ గ్రామ సచివాలయం పరిధి నేతాజీనగర్ కాలనీ (ఎన్ఎస్ కాలనీ)లో శనివారం ఉదయం 11 గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించనున్నారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదలైంది.

వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీతులసి

హిరమండలం: వైద్య సేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అదనపు డీఎంహెచ్‌వో లక్ష్మీతులసి అన్నారు. గ్రామీణ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. హిరమండలం మేజర్ పంచాయతీ పరిధి పెద్దకోరాడలో 104 సంచార వైద్యవాహన ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) గ్రామీణ వైద్యశిబిరాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసేవలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. పీహెచ్‌సీల ద్వారా అందుతున్న సేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దానికి అనుగుణంగా సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఫీవర్, ఎన్‌సీడీసీడీ సర్వేలు పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం హిరమండ లం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఆమెతో పాటు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిగీత, డాక్టర్ ఫరూక్ హూస్సెన్, డాక్టర్ శ్యాముల్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాతపట్నం: సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ సీఐ వై.లక్ష్మునాయుడు అన్నారు. స్థానిక ఆల్ఆంధ్రా రోడ్డు సమీపంలోని మహేంద్ర డిగ్రీ కళాశాలలో ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ మణికంఠ ఆదేశాల మేరకు శుక్రవారం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలను ఎవరైనా రవాణా చేసినట్టు తెలిస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్యులు, అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు ఆర్చి నిర్మాణం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి సాధు దిలీప్ చక్రవర్తి రూ. రెండు లక్షలతో ప్రధాన గేటు వద్ద ఆర్చిని నిర్మించారు. దీన్ని తన సోదరుడైన ఐఏఎస్ అధికారి శివచక్రవర్తితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ.. తన తండ్రి చిన్న అప్పలస్వామి జ్ఞాపకార్థం అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాము ఇదే స్కూల్లో చదువుకున్నామని.. ఈవిధంగా బడి రుణం తీర్చుకునేందుకు అవకాశం వచ్చిందన్నారు. స్కూల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు.

నియామక పత్రం అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పెద్దమల్లిపురం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా జన్ని బాబూరావు నియమితులయ్యారు. దీంతో నియామకపత్రాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాబూరావుకు అందజేశారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా పనులను సక్రమంగా చేయించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో అంగూరు సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎనుగుతల సూర్యం ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న డీఈ అప్పారావు

సారవకోట: జగనన్న లేవుట్లలో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ డీఈ అప్పారావు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 24 లేవుట్లలో 405 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే పీఎంఏవై పథకం ద్వారా 363 గృహాయలు మంజూరైయ్యాయని వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. 1800 గృహాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ప్రవల్లికా ప్రియ, ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఎంఈవో ఎంవీ రమణ, ఏఈలు ప్రసాదరావు, కోదండరావు ఉన్నారు.

వలంటీర్లపై దుష్ప్రచారం తగదు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేయడాన్ని ఓర్వలేని చంద్రబాబు, రామోజీలు వలంటీర్ల వ్యవస్థపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన కోడికూయక ముందే వృద్ధుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తున్న వలంటీర్లను చూసి ఓర్వలేనితనంతో ఈనాడులో పనికిరాని రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీకి లభిస్తున్న ప్రజాదరణ టీడీపీ నేతలకు మింగుడు పడటం లేదన్నారు. టీడీపీ హయాంలో ప్రతి పథకానికి ఓ రేటు పెట్టి జన్మభూమి కమిటీలు దోచుకున్నా ఏనాడూ ఎల్లో మీడియా ఒక్క కథనం కూడా రాలేదన్నారు. వలంటీర్ అంటే స్వచ్ఛమైన సేవకులని, జన్మభూమి కమిటీల్లా దోచుకుతినే రాబందులు కాదన్నారు. వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు సారథులుగా ఉంటేవలంటీర్లు వారధులుగా ఉంటారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, కనపల తేజ, సీపాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

'హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలి'



కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న గూనభద్రకు చెందిన పారాపురం రిజర్వాయర్ ప్రభావిత కుటుంబాలు

కొత్తూరు: పారాపురం రిజర్వాయర్ ప్రభావిత కుటుంబాలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు కోరారు. కొత్తూరు మండలం వంశధార ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వల్ల గూనభద్ర గ్రామానికి చెందిన వారిని ప్రభావిత కుటుంబాలుగా గుర్తించాలని స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. వీరిని ప్రభావిత కుటుంబాలుగా గుర్తించాలని కోర్టు ఎనిమిది నెలల కిందట తీర్పునిచ్చింది. కానీ రెవెన్యూ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో వారు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు ఇస్తున్నా స్థానిక అధికారులు స్పందించడం లేదన్నారు. ఫిబ్రవరి నాటికి సమస్య పరిష్కరించకుంటే అలికాం-బత్తిలి రోడ్డుపై ఆందోళన చేస్తామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభావిత కుటుంబాల జాబితాను హైకోర్టుకు పంపించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరావు సింహాచలం రాష్ట్రం ఉపాధ్యక్షురాలు గంగరావు ఈశ్వరమ్మ, పాల్గొన్నారు.

ఫ్యామిలి డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వసపలోని విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద మాట్లాడుతున్న శ్రీలత

కొత్తూరు: ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఫ్యామిలి డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలత కోరారు. వసప విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన 32 మందికి సేవలందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కురిగాం ఈవో బుజ్జిబాబు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభలను విజయవంతం చేద్దాం

పొందూరు: శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.గణేష్ కోరారు. మండలంలోని వావిలపల్లిపేట కూడలికి సమీపంలో ఉన్న రాజ్యలక్ష్మి పోల్ ఇండస్ట్రీ కార్మికులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహాసభల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్మికుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి పోల్స్ వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సనపల అప్పారావు, అధ్యక్షులు లింగాల రాజారావు పాల్గొన్నారు.

జలుమూరు: ఐఎఫ్‌టీయూ జిల్లా ద్వితీయ మహాసభలు విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు నేతింటి నీలంరాజు కోరారు. సుబ్రహ్మణ్యపురంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు సింగూరు తిరుపతిరావు, పల్లి ఈశ్వరరావు,టి.లక్ష్మీనారాయణ, కె.రమణ పాల్గొన్నారు.

రెండు పూటలా పనితో గిట్టుబాటు వేతనం



పాతపట్నం: బూరగాంలో వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

సారవకోట: ఉపాధి హామీ పథకం వేతనదారులు రెండు పూటలా పనిచేయాలని డ్వామా పీడీ చిట్టిరాజు సూచించారు. అంగూరులో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు పూటలా పనిచేయ డం ద్వారా 250 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు.

ఉపాధికి వేతనదారులే యజమానులు

మెళియాపుట్టి : ఉపాధి వేతనదారులే ఆ పథకానికి యజమానులని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో జరుగుతున్న వరద నియంత్రణ కట్ట పనులను పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడుతూ.. బయట కూలి చేస్తే ఒకరి కింద పనిచేయాల్సి ఉంటుందని, ఉపాధిలో మీరే యజమానులని అన్నారు. పనిచేస్తున్న ఎవరిని పిలిచి అడిగినా వారి జాబ్‌కార్డు నంబర్ టక్కున చెప్పేస్తుండటంతో ఆయన ఆశ్చర్యపోయారు. అనంతరం వేతనదారులతో మమేకమై సహపంక్తి అల్పాహారం చేశారు. వేతనదారులు మూగి అంకమ్మ, రాయవలస ఇందిర, గాసి జయమ్మ మాట్లాడుతూ ఇలాంటి అధికారిని మునుపెన్నడూ చూడలేదన్నారు. పెద్దపద్మాపురంలో పెద్దినాయుడు చెరువు పనులను, సుందరాడలో జీడిమామిడి తోటల్లో కందకాల పనులను పరిశీలించారు. ఆయనతోపాటుగా ఎంపీడీఓ పడాల చంద్రకుమారి, ఏపీఓ రవి, ఈసి తారా ఆదినారాయణ రెడ్డి ఉన్నారు.

రోజుకు ఆరు గంటలు పని చేయాలి

పాతపట్నం: ఉపాధి హామీ పథకం వేతనదారులు రోజుకు కనీసం ఆరు గంటలు పనిచేయాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. బూరగాం, కాగువాడ గ్రామాల్లో పర్యటించిన ఆయన వేతనదారుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు రెండు పూటాలా ఆరు గంటలు పనిచేస్తే రూ.250 గరిష్ఠ వేతనం వస్తుందన్నారు. వేతనదారులందరూ సమానంగా పనులు చేయాలన్నారు. ఏపీడీ తెంబూరు రవి, ఏపీవో సురేష్, బూరగాం వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రల్లాద పుల్లాయ్ ఉన్నారు.